TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :135 prajadivvs57@gmail. com మంగళవారం 24, మార్చి 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-




## పశ్చిమాసియా సంక్షోభం..
# భారత్‌కు సవాళ్లు

- యుద్ధ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడే అవకాశం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- ఇంధన సరఫరా, నిల్వలపై కేంద్రం అప్రమత్తం
- లోక్‌సభలో ప్రధాని మోదీ

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. లోక్‌సభలో మాట్లాడిన ఆయన, మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు విసురుతోందని చెప్పారు. భారత్ ఇంధన అవసరాల్లో కీలక భాగం పశ్చిమాసియా నుంచే వస్తోందని, యుద్ధం ప్రభావం ప్రజల జీవనంపై కూడా పడుతోందని పేర్కొన్నారు.

# మోదీ రాజీపడ్డారు

## పార్లమెంటులో చర్చకు రావడం లేదు: రాహుల్





పశ్చిమాసియాలో పరిస్థితిపై నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని తన ప్రసంగంలో ఎక్కడా కూడా అమెరికా పేరును ప్రస్తావించ లేదని, నూటికి నూరు శాతం ఆయన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంట్రోల్‌లో ఉన్నారని విమర్శించారు.

## మూసీ ప్రక్షాళన..
# సామాన్యుడికి భరోసా!

## ఎవరికీ నష్టం జరగదు.. సీఎం హామీ

మెరుగైన వసతులతో పునరావాసం ▪ కాలుష్య రహిత నగరమే లక్ష్యం
భాగ్యనగరానికి పూర్వవైభవం ▪ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల పరివాహక ప్రాంత ప్రజలెవరూ నిరాశ్రయులు కారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా వారందరికీ ప్రభుత్వం మెరుగైన వసతులతో కూడిన పునరావాసం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మూసీ ప్రజలను ఆదుకునే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వాటిని తప్పనిసరిగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతను ఈ సందర్భంగా ఆయన సభ ముందు ఉంచారు.

మిగతా 2 లో



## బడ్జెట్‌లో కోతలు..
# రైతులకు వాతలు!


2

- హామీల అమలు ఎక్కడ?
- రైతులకు కాంగ్రెస్ దగా
- హరీశ్‌రావు ధ్వజం
- ఆదాయం పెంపుపై నిలదీత!

# గ్యారంటీలకు చట్టబద్ధత.. బీఆర్ఎస్ పట్టు

2

అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు నోటీసు




# డిజిటల్ వోచర్లతో ప్రచారం

- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిర్ణయం
- దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో పార్టీలకు ఉచిత ప్రసార సమయం
- ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ టైమ్ వోచర్లు జారీ

భారత ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కేటాయించేందుకు డిజిటల్ వోచర్ల విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు ప్రకటించింది. ఈ ఉచిత ప్రసార అవకాశం దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. త్వరలో జరగనున్న అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.



# భారీగా తగ్గిన బంగారం ధరలు

యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు




## 10 కేజీల ఎల్పీజీ సిలిండర్లపై కేంద్రం స్పష్టత

ఆ వార్తలు ఊహాగానాలేనని వివరణ

ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి నిర్ణయం లేదు

ప్రస్తుతం 14.2 కేజీల సిలిండర్లే కొనసాగింపు



# మెట్రో మ్యాజిక్

## హైదరాబాద్‌కు మహర్దశ!

రూ. 24 వేల కోట్లతో రెండో దశ.. రన్‌వే కింద అండర్ టన్నెల్
ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో అనుసంధానం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## కీలక బిల్లులకు కేబినెట్
# పచ్చజెండా!

గిగ్ వర్కర్ల భద్రతకు ప్రత్యేక చట్టం

అడ్వకేట్ల రక్షణ బిల్లుకు ఆమోదం


మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం

రోహిత్ వేముల చట్టంపై సబ్ కమిటీ ఏర్పాటు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# క్యూనెట్ ఘరానా మోసం



- 32 మంది కేటుగాళ్ల అరెస్ట్
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్
- బాధితుడి ఆత్మహత్యతో వెలుగులోకి..
- సీపీ సజ్జనార్ వెల్లడి!

క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు.

### ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాం.. ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వ న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

# గ్యారంటీలకు చట్టబద్ధత.. బీఆర్ఎస్ పట్టు

### అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు నోటీసు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మాణిక్ రావు, దాసోజు శ్రవణ్‌కుమార్, శంభీపూర్ రాజు, మాధవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

# బడ్జెట్‌లో కోతలు.. రైతులకు వాతలు!

- హామీల అమలు ఎక్కడ?
- రైతులకు కాంగ్రెస్ దగా
- హరీశ్‌రావు ధ్వజం
- ఆదాయం పెంపుపై నిలదీత!



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి 15 వేల రూపాయలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని మండిపడ్డారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడుతూ ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు.

### రైతుబంధుపై నిలదీత

మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని ఆరోపించారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని రెండు బడ్జెట్‌లలో పెట్టినా ఒక్కసారి కూడా ఇవ్వలేదని తప్పుబట్టారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పి ఇప్పుడు ఆ ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు.

### కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు

అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఆపకుండా రైతుబంధు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గొట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎకరానికి 15 వేల రూపాయల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. తొలి బడ్జెట్‌లో ప్రకటించి ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### హామీల ఉల్లంఘన

గతంలో తమ ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒకే పంటకు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టిన అంశాలను కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయాల్లోనే రైతులకు వరాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. రెండు బడ్జెట్లలో ఉన్న పంటల బీమా పథకం ఈ బడ్జెట్‌లో మాయం కావడాన్ని ఆయన ప్రశ్నించారు.

### మాయమైన పథకాలు

రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా అమల్లోకి రాలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన ఈ బడ్జెట్‌లో లేకపోవడాన్ని తప్పుబట్టారు. అలాగే ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా 12 వేల కోట్ల రూపాయలు పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న అబ్కారీ ఆదాయాన్ని 46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని నిలదీశారు. ఇందుకోసం ఊరూరుకు బార్లు తెరుస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### ఆదాయం పెంపుపై నిలదీత

ఈ సమయంలో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో 12 వేల కోట్లుగా ఉన్న ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 36 వేల కోట్లు పెంచిందని చెప్పారు. జూపల్లి జోక్యం చేసుకోవడంపై హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని కోరారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, కేవలం ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అంశం కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు.

# పెన్షనర్ల వేదన.. బీఆర్ఎస్ వాకౌట్!

### బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

### అసెంబ్లీలో గళమెత్తిన విపక్ష సభ్యులు

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా, కల్వకుంట్ల సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు 700 కోట్ల రూపాయల బకాయిలను చెల్లిస్తామని చెప్పి, ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

# మూసీ ప్రక్షాళన.. సామాన్యుడికి భరోసా!

### ఎవరికీ నష్టం జరగదు.. సీఎం హామీ

- మెరుగైన వసతులతో పునరావాసం
- కాలుష్య రహిత నగరమే లక్ష్యం
- భాగ్యనగరానికి పూర్వవైభవం



మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల పరివాహక ప్రాంత ప్రజలెవరూ నిరాశ్రయులు కారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా వారందరికీ ప్రభుత్వం మెరుగైన వసతులతో కూడిన పునరావాసం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మూసీ ప్రజలను ఆదుకునే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వాటిని తప్పనిసరిగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతను ఈ సందర్భంగా ఆయన సభ ముందు ఉంచారు.

### మహానగరాల అనుభవాలు

దేశంలోని ఢిల్లీ ముంబై బెంగళూరు చెన్నై వంటి నగరాల్లో తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ముంబైలో వర్షాలు కురిస్తే నివసించలేని పరిస్థితి ఢిల్లీలో తీవ్రమైన కాలుష్యం బెంగళూరులో ట్రాఫిక్ ఇబ్బందులు చెన్నైలో నీటి ముంపు వంటి పరిస్థితులను మనం గమనించాలని సూచించారు. నల్గొండ ప్రజల కష్టాలను వారి ఆవేదనను గమనించే వారెవరూ ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుకోరని ఆయన అన్నారు. సలహాలు తీసుకోవడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తామని ప్రకటించారు. ఏ రాష్ట్ర ప్రగతి అయినా ఆ రాష్ట్ర నగరాలు పెట్టుబడులు ప్రజల జీవన స్థితిగతులపై ఆధారపడి ఉంటాయని గుర్తు చేశారు.

### కాలుష్య రహిత కార్యాచరణ

తెలంగాణను క్యూర్ ప్యూర్ రేర్ అనే మూడు ప్రాంతాలుగా విభజించి సమగ్ర ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల నగరం కాలుష్య రహితంగా మారుతుందని హిల్ట్ పాలసీ ద్వారా ఇక్కడి భూములను మల్టీయూజ్ జోన్లలోకి మారుస్తున్నామని చెప్పారు. దీనివల్ల భూ యాజమాన్య హక్కులు మారకుండా మధ్య తరగతి నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. పరిశ్రమల తరలింపు ద్వారా నగరాన్ని సర్వీస్ సెక్టార్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కులీకుతుబ్ షాహీల కాలం నాటి చారిత్రాత్మక కట్టడాల వైభవాన్ని కాపాడుతూనే ఆధునిక సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు.

### గోదావరి నీటితో ప్రక్షాళన

గోదావరి నుంచి ఇరవై టీఎంసీల నీటిని తరలించి అందులో పదిహేడు టీఎంసీలను జంటనగరాల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన మూడు టీఎంసీల నీటిని మూసీ నదిలో నిరంతరం ప్రవహించేలా చూస్తామని దీనివల్ల మూసీ ప్రాజెక్టు నూతన రూపును సంతరించుకుంటుందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఒక పటిష్టమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుందని ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో అందరూ సహకరించాలని కోరారు. ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా పారదర్శకమైన పద్ధతిలో పునరావాస పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. మానవ తప్పిదాల వల్ల కలిగిన కాలుష్యాన్ని దూరం చేసి రేపటి తరానికి స్వచ్ఛమైన హైదరాబాద్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

# మెట్రో మ్యాజిక్.. హైదరాబాద్‌కు మహర్దశ!

- రూ. 24 వేల కోట్లతో రెండో దశ
- రన్‌వే కింద అండర్ టన్నెల్
- ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో అనుసంధానం
- ట్రాఫిక్ ఫ్రీ సిటీయే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

: హైదరాబాద్ నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి మెట్రో విస్తరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టడం వంటి బృహత్తరమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చి నగర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. శాసనమండలి సభ్యులు లేవనెత్తిన ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి మెట్రో రోడ్ల విస్తరణపై సమగ్రంగా వివరించారు. చివరి ప్రాంతం వరకు రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో రూ. 24 వేల కోట్లతో మెట్రో రెండో దశను 76 కిలోమీటర్ల మేర విస్తరించడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని పేర్కొన్నారు.

### మెట్రో రెండో దశ విస్తరణ

హైదరాబాద్ మెట్రో ప్రారంభమైనప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా గత దశాబ్దకాలం ఎలాంటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో తొమ్మిదో స్థానంలోకి పడిపోయామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి ఎక్కడి నుంచి అయితే ట్రాఫిక్ ప్రారంభమవుతుందో అటువంటి హయత్‌నగర్ రామచంద్రాపురం లాంటి ప్రాంతాలకు మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎల్బీనగర్ వద్ద ఆగిపోయిన మెట్రోను హయత్‌నగర్ వరకు పొడిగించడంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి నాగోల్ ఓవైసీ ఆసుపత్రి చాంద్రాయగుట్ట రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో కనెక్టివిటీ కల్పిస్తున్నామని వివరించారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉండే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నియోపోలిస్ వరకు కూడా మెట్రోను విస్తరించడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు.

### ఎలివేటెడ్ కారిడార్లు - అండర్ టన్నెల్


ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను మూడు రకాలుగా విభజించి అండర్ పాస్ సర్ఫేస్ రోడ్లు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉత్తర తెలంగాణ మార్గంలో బాటిల్ నెక్‌గా మారిన కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రక్షణ శాఖ నుంచి 153 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట విమానాశ్రయ రన్‌వే కింద నుంచి అండర్ టన్నెల్ నిర్మాణానికి అనుమతి తీసుకుని పనులు మొదలుపెట్టామని వెల్లడించారు. నల్గొండ వైపు వెళ్లే వారికి ఇబ్బందిగా మారిన జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూన్ లేదా జూలై నాటికి అందుబాటులోకి వస్తుందని ఆయన సభకు వివరించారు.

### పాదచారుల భద్రత - మూసీ ప్రక్షాళన

నగరంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడానికి ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి చెప్పారు. పార్కింగ్ సమస్యల పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ నాంపల్లి వంటి ప్రాంతాల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ వెంట గౌరవెల్లి వరకు సుమారు 43 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ కారిడార్ నిర్మాణం వల్ల నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్ సైబరాబాద్ మేడ్చల్ కార్పొరేషన్లతో పాటు నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

### మృతుల కుటుంబాలకు 'కోటి' భరోసా

**విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగులు ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి రూపాయల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. అసెంబ్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచుతూ ఉద్యోగ కుటుంబాల్లో ధైర్యం నింపారు.**



# ప్రమాదకరంగా కప్ సాసర్

## - కప్ సాసర్ ను ఢీకొన్న ఆటో
## - ఒకరికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు





**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 23 ప్రజా దివాస్** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పాత బస్టాండ్ సమీపంలో సమయం 05:45 నిమిషాల ప్రాంతంలో కప్ సాసర్ డివైడర్ను ఢీకొని ఆటో (టీఎస్ 23 టి 1869) పల్టీలు కొట్టి డ్రైవర్ బొమ్మనవేణి రాజు (41) కు తీవ్ర గాయాలయ్యాయి, వివరాల్లోకి వెళితే బొమ్మనవేణి రాజు వృత్తి రీత్యా ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు, ప్రతిరోజు ఉదయం కరీంనగర్ డైరీ కి సంబంధించిన పదిర, పోతిరెడ్డిపల్లి,హరిదాస్ నగర్ పాల కేంద్రాల నుండి పాలు సేకరించి ఎల్లారెడ్డిపేట డైరీలో డెలివరీ చేస్తుంటాడు ప్రతిరోజు లాగే ఈరోజు పదిర గ్రామం నుండి పాలు తీసుకొని గొల్లపల్లి వైపు వస్తుండగా ఎల్లారెడ్డిపేట కప్ సాసర్ వద్ద ఉన్న డివైడర్ పైకి వెనుక టైరు ఎక్కడంతో ఆటో పల్టీలు కొట్టి తలకు తీవ్ర గాయాలయి రక్తపు మడుగులో ఉన్న రాజను బిజెపి నాయకులు గమనించి స్థానిక ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించి చికిత్సను అందించి కుటుంబ సభ్యులకు తెలిపారు, ప్రస్తుతం రాజు ప్రస్తుతం రాజు కోమ స్థితిలో ఉన్నాడు,రాజుకు భార్య భాగ్యలక్ష్మి ఉన్నారు, విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు, స్థానికులు డివైడర్ కు రేడియం లాంటి సేఫ్టీ లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు,కప్ సాసర్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జనగణన చేయాలి

**శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**జనగణన 2027పై చార్జ్ ఆఫీసర్లకు సహాయకులు,**

**సాంకేతిక సహాయకులకు శిక్షణ కార్యక్రమం**





**రాజన్న సిరిసిల్ల, మార్చి - 23 ప్రజా దివాస్**జనగణన - 2027 ను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027 లో భాగంగా సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్, మొబైల్ యాప్, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హౌస్ లిస్టింగ్, బ్లాక్స్ డిజిటల్ విధానంలో సిద్ధం చేయడం, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం తదితర అంశాల పై చార్జ్ సహాయకులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ కార్యక్రమం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు.ప్రభుత్వ పథకాలను రూపకల్పనకు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనగణన చాలా ఉపయోగప డుతుందని తెలిపారు. ఆరోగ్య, అక్షరాస్యత, జనాభా, లింగ నిష్పత్తి, వలసలు, ఉపాధి నివాస స్థితి తదితర అంశాల వివరాలు జనగణనతో ప్రభుత్వం వద్ద ఉంటాయని వెల్లడించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు.శిక్షణలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్, డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ నుంచి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్ శ్రేయ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో 80 లక్షలతో షాదీఖానా నిర్మాణం..





**- క్షేత్రస్థాయిలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలన**

**-మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.. సకల హంగులతో షాదీఖానా నిర్మిస్తామన్న మున్సిపల్ చైర్మన్**

**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 23** వేములవాడ పట్టణాభివృద్ధిలో భాగంగా ముస్లిం సోదరుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం షాదీఖానా నిర్మాణానికి 80 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అక్రమ్ మరియు ఇతర మత పెద్దలతో సమావేశమై వారి సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల చిరకాల కోరిక మేరకు అన్ని హంగులతో, సకల వసతులతో ఈ షాదీఖానా నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ ఇంజనీర్ వరుణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, ముస్లిం మైనార్టీ కమిటీ నాయకులు మరియు పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.



# టీపీఎస్ ఏర్పాటుకు పరిశీలించిన కలెక్టర్

**-సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సందర్శన**





**రాజన్న సిరిసిల్ల, మార్చి - 23 ప్రజా దివాస్** తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటుకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో స్కూల్, జూనియర్ కళాశాల కొనసాగుతుండగా, పరిశీలించి.. విద్యార్థుల సంఖ్య, ఎన్ని గదులు, ఎంత విస్తీర్ణంలో ఉందో ఆరా తీశారు. గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్ కూడా పరిశీలించారు.పరిశీలనలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్ 167 అర్జీల రాక**





**రాజన్న సిరిసిల్ల, మార్చి -- 23 ప్రజా దివాస్** సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 167 అర్జీల రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు.రెవెన్యూ శాఖకు 62, గృహ నిర్మాణ శాఖకు 28, డీఆర్డీఓకు -- 19, జిల్లా పంచాయతీ కార్యాలయం 9, ఉపాధి కల్పన అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి 5 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కు 4, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్యాధికారి, జిల్లా సంక్షేమ శాఖ, నీటి పారుదల శాఖ, సెస్ ఎండీకి 3 చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, మైనింగ్ శాఖ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయం, లీడ్ బ్యాంక్ మేనేజర్ కు 2 చొప్పున, మత్స్య శాఖ అధికారి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, ఈడీఎం, ఈఈ ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, సబ్ రిజిస్టర్ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



**రాజన్న సిరిసిల్ల, మార్చి - 23 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ, బీ వింగ్ పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు సౌకర్యాలను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.

# వేములవాడ భీమేశ్వర ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ -- సౌకర్యాలపై ఈవో పరిశీలన



**వేములవాడ/ ప్రజాదివాస్ మార్చి 23** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ఆలయంలో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.దర్శనానికి వచ్చే వృద్ధ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ర్యాంపును పరిశీలించి, అది ఎలా ఉపయోగపడుతోంది అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీటి సౌకర్యం సక్రమంగా వస్తుందో లేదో నల్లాను ఓపెన్ ద్వారా పరిశీలించారు.భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టిన అనంతరం కూర్చొని కొబ్బరి ముక్కలు తినే ప్రదేశాలను కూడా ఈవో పరిశీలించారు. ఆ సమయంలో కొబ్బరి ముక్కలు చిన్నచిన్నగా విరిగి నేలపై పడిపోవడంతో అవి భక్తుల కాళ్లకు గుచ్చుకుని గాయాలు కావడం, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని భక్తులకు సూచించారు. అనంతరం అక్కడ ఉన్న కొబ్బరి ముక్కలను స్వయంగా ఏరివేసి డస్ట్‌బిన్‌లో వేశారు. తదుపరి శానిటేషన్ సిబ్బందిని పిలిపించి ఆ ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే ఆలయంలో ఉన్న రూ.100 శీఘ్ర దర్శనం, రూ.300 అతి శీఘ్ర దర్శనం, రూ.200--500 కోడె టికెట్ల కౌంటర్లను పరిశీలించి టికెట్ల జారీ విధానాన్ని తెలుసుకున్నారు. ఆలయంలోని వివిధ ప్రదేశాలను తిరిగి పరిశీలించి భక్తులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, ఎస్పీఎఫ్ సిబ్బంది ఈవో వెంట ఉన్నారు.

# లింగంపేటలో కులం పేరుతో దూషణ: సర్పంచ్, ఉప సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు

**చందుర్తి మండలం ప్రజా దివాస్ మార్చి 23** చందుర్తి మండలం లింగంపేట గ్రామంలోని శ్రీ సీతారామస్వామి ఆలయ చైర్మన్ పదవి విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. ప్రస్తుత ఆలయ చైర్మన్ తర్రె చంద్రశేఖర్‌ను కులం పేరుతో దూషించినందుకు గాను గ్రామ సర్పంచ్ కొక్కుల నరేష్, ఉప సర్పంచ్ ఆకుల ఎల్లయ్య, సుంకి వేణులతో పాటు గొడవను ప్రోత్సహించిన దప్పుల అశోక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది.ఘటన వివరాలు: గత రెండేళ్లుగా ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న తర్రె చంద్రశేఖర్‌ను ఈ ఏడాది కూడా కొనసాగించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ క్రమంలో శ్రీరామనవమి వేడుకల కోసం భక్తులు ఇచ్చే విరాళాల వివరాలను చంద్రశేఖర్ మైకులో చదువుతుండగా, సర్పంచ్ నరేష్, ఉప సర్పంచ్ ఎల్లయ్య, సుంకే వేణులు అక్కడికి చేరుకున్నారు. "నీకు చైర్మన్ పదవి ఎవరిచ్చారురా?" అంటూ చంద్రశేఖర్‌ను కులం పేరుతో కించపరుస్తూ, అసభ్య పదజాలంతో దూషించి మైకును లాక్కున్నారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.డీఎస్పీ విచారణ: ఈ ఘటనపై సోమవారం వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు లింగంపేట గ్రామాన్ని సందర్శించి సాక్షులను విచారించారు.



అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న శ్రీరామనవమి వేడుకలను ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రస్తుతానికి పాత కమిటీ ఆధ్వర్యంలోనే వేడుకలు జరపాలని, ఇందుకు ఇరు వర్గాలు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డీఎస్పీ వెంట చందుర్తి ఎస్సై రమేష్ ఉన్నారు.

# జగన్ ప్లాన్ అమలు చేయనున్న జీవన్ రెడ్డి !



**జగిత్యాల/ప్రజాదివాస్ మార్చి 23** జగిత్యాల రాజకీయాల్లో 4 దశాబ్దాల పాటు చక్రం తిప్పిన జీవన్ రెడ్డి, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో తనకు 2 సంవత్సరాల నుండి ఎదురవుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.. అయితే ఏదో పార్టీ మారిపోయి కండువా కప్పుకుంటే ఎఫెక్ట్ రాదని..కొత్తగా ప్రయత్నిస్తున్నారు. ూా జగన్ ప్లాన్ ను అడాప్ట్ చేసుకుని అమలు చేసేందుకు రెడీ అయ్యారు.!!

**తనకి అన్యాయం జరిగిపోయిందని ఇక యాత్ర చేయనున్న జీవన్ రెడ్డి**

గతంలో వైఎస్ జగన్ తనకు కాంగ్రెస్‌లో అన్యాయం జరిగిందనే సెంటిమెంట్‌తో ఎలాగైతే ప్రజల్లోకి వెళ్లారో, ఇప్పుడు జీవన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. మార్చి 25న అధికారికంగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన తర్వాత, గ్రామ గ్రామాన తిరుగుతూ తన ఆవేదనను ప్రజలకు తెలియజేయనున్నారు, జీవన్ రెడ్డి ఇప్పటికే తన తదుపరి రాజకీయ అడుగులపై ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రాథమిక చర్చలు పూర్తి చేశారు. కాంగ్రెస్ అధిష్టానం తనను విస్మరించిందనే పాయింట్‌ను బలంగా వాడుకుంటూ, ఈ రెండు పార్టీలలో ఏదో ఒక దానిలో చేరడం ద్వారా తన ఉనికిని చాటుకోవాలని చూస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా, ఆయన ఏ జెండా పడతారనేది జగిత్యాల నియోజకవర్గంలో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

**వయసు భారం రాజకీయ అనుభవం**

ఇక్కడ ప్రధానమైన చర్చ జీవన్ రెడ్డి వయసు, ఆయనకున్న ప్రజాదరణ గురించి సాగుతోంది. జగన్ రెడ్డి తన తండ్రి వైఎస్ఆర్ ఇమేజ్‌ను మార్కెటింగ్ చేసుకుని యువకుడిగా దూసుకుపోయారు. కానీ, జీవన్ రెడ్డి వయసు ప్రస్తుతం 75 ఏళ్లు దాటింది. ఈ వయసులో ఆయనకు ఈ పోరాటం అవసరమా అనే ప్రశ్న సామాన్య జనం నుండి వినిపిస్తోంది. జగిత్యాల ప్రజలకు ఆయన రాజకీయ ప్రస్థానం మొత్తం తెలుసు. అప్పట్లో ఆయన చేసిన అభివృద్ధి, ఇప్పుడు ఆయన పడుతున్న ఆవేదన మధ్య ప్రజలు దేనికి ప్రాధాన్యత ఇస్తారనేది కీలకం కానుంది.జీవన్ రెడ్డి తన రాజకీయ జీవితానికి పునరుజ్జీవం పోయాలనుకుంటున్న ఈ ప్రయత్నం, ఆయనను మళ్ళీ హీరోగా నిలబెడుతుందా అనేది చూడాలి. సెంటిమెంట్‌ను నమ్ముకుని ఆయన చేస్తున్న యాత్రకు ప్రజల నుండి ఏ మేర ఆదరణ లభిస్తుందో చూడాలి, జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకున్న పాత కేడర్ ఇప్పటికీ ఆయన వెంటే ఉన్నప్పటికీ, తటస్థ ఓటర్ల తీర్పు మాత్రం జీవన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

# కరీంనగర్: 'కీడు' సోకిందని ఊరు ఖాళీ చేసిన గ్రామస్థులు!

**- 3 నెలల్లో 28 మంది మృతి..**




**జమ్మికుంట మండలం/ప్రజాదివాస్ మార్చి 23** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామంలో గత 3 నెలలుగా వరుసగా 28 మంది వివిధ కారణాలతో మరణించడం తీవ్ర ఆందోళన కలిగించింది. గ్రామానికి ఏదో 'కీడు' సోకిందని బలంగా నమ్మిన గ్రామస్థులు, పురోహితుడి సూచన మేరకు వింత నిర్ణయం తీసుకున్నారు. ఒక రోజంతా ఊరు ఖాళీ చేసి పొలాల్లో 'కీడు వంటలు' వండుకోవాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం తెల్లవారుజామునే ఇళ్లకు తాళాలు వేసి, డప్పు చాటింపు వేయించి మరీ ఊరి బయటకు వెళ్లారు. ఇలా చేస్తేనే గ్రామానికి పట్టిన పీడ విరుగడవుతుందని వారు విశ్వసిస్తున్నారు

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం రేపిన ఘటన చోటుచేసుకుంది. జిల్లా ప్రధాన న్యాయస్థానానికి బాంబు బెదిరింపు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేసింది.






**సిరిసిల్ల మార్చి 23 ప్రజా దివాస్** గుర్తుతెలియని వ్యక్తులు కోర్టు అధికారిక ఈమెయిల్ ఐడీకి ఆదివారం బెదిరింపు మెయిల్ పంపినట్లు సమాచారం. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది ఆ మెయిల్‌ను గమనించి అప్రమత్తమయ్యారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు తక్షణమే స్పందించారు. బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను సంఘటన స్థలానికి తరలించి కోర్టు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ ఘటనతో కోర్టు పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. న్యాయవాదులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా, బెదిరింపు మెయిల్ పంపిన వారి వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కోర్టు పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# వేములవాడలో శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 23** వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27-03-2026 శుక్రవారం జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ఈసారి ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు సౌకర్యంగా కళ్యాణోత్సవాన్ని వీక్షించేందుకు 15 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు .కార్యక్రమాన్ని భక్తులు స్పష్టంగా వీక్షించేందుకు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే భద్రతా దృష్ట్యా బ్యారికేడ్లు, ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు నడవడానికి గ్రీన్ మ్యాట్లు పరచనున్నారు.భక్తుల కోసం త్రాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు అందుబాటులో ఉంచనున్నారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.అదేవిధంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, టెంట్లు, విద్యుత్ దీపాలు, కూలర్లు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు స్వామివారి అన్నప్రసాదం పంపిణీ కూడా నిర్వహించనున్నారు.శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆలయ ఉద్యోగులకు సూచించారు.



